తల్లిలేని ఆమెకి తండ్రి మళ్ళీ పెళ్ళి ఓదార్పునిచ్చిందా?

# మౌనసాక్షి

గోవిందరాజు రామకృష్ణారావు కథ

క్రితంసారి కంటె ఈ యేడాది ఫలితాలు పదిరోజులు ఆలస్యంగా ప్రకటించారు. హెడ్మాస్టరు తీర్థయాత్రల మంచి అనుకున్న తేదీకి రాలేకపోయారు. ఇన్‌ఛార్జి పక్క వూళ్ళో వుంటున్నాడు. తక్కిన టీచర్లు పేపర్లు దిద్దడం నత్తనడకతో సాగింది.

ఇంకానయం ఒక రోజు ముందుగా ప్రకటించారు. మర్నాడు చెబుతారని అందరూ అనుకున్నారు. నోటీసు బోర్డులో అలాగే తెలియజేశారు.

ఫలితాలు ఆలస్యంగా వచ్చినందుకు జయకి బాధేమీలేదు. మంచి మార్కుల్తో పాసైనందుకు సంతోషం కూడా ఏకోశానా లేదు. 'పదేళ్ళ పసివయసులో వున్న జయ చెంగుచెంగున గంతువెయ్యాలి. అయిదో తరగతి ప్యాసయ్యానని చిన్నాపెద్దా అందరికీ చెప్పాలి. కాని అలా జరగలేదు.

క్రిందటి సంవత్సరం బడి నుంచి పరిగెత్తుకొచ్చి అమ్మని కావిలించుకుని అమ్మా! నేను క్లాసు ఫస్టు వచ్చా' అని పట్టరాని సంతోషంతో చెప్పింది.

'నా తల్లే, నా బంగారుకొండే! నీకు కాక ఎవరికొస్తాయమ్మా అన్ని మార్కులు!' తల్లి సీత గర్వంతో ఆనందం పంచుకుంది.

గబగబా పక్కింటి వాళ్ళకి ఈ కబురు అందించింది. భర్త కనకయ్యని బజారు పంపి మిఠాయి తెప్పించింది. చుట్టు పక్కలందరికీ పంచింది. పాయసం చేసింది . బంధువులికి ఉత్తరాలు రాయించింది. పరికిణీకి, జాకెట్టుకు సిల్కు గుడ్డకొని టైలరికిచ్చింది. సీత సంబరం ఇంతా అంతా అని చెప్ప శక్యం కాదు.



జయకి అవన్నీ కళ్ళకి కట్టినట్టే వున్నాయి. ఇంటికొచ్చింది. వచ్చీ రాగానే నాయనమ్మ మెడ చుట్టూ చేతులువేసి 'నేను అయిదో తరగతి ప్యాసయ్యాను నాయనమ్మా!' అంటూ బావురుమని యేడ్చింది.

'సంతోషం తల్లీ!' మనవరాల్ని పొదివి పట్టుకుని గొల్లుమంది.

కాసేపు మాటలు రాలేదు. కన్నతల్లి కోసం అలమటించే చిన్నారి మనసు ఏమని చెబితే వూరడిల్లుతుంది. కాన్పు కష్టమై సీత కన్నుమూసి యేడాదయింది. బిడ్డ కూడా దక్కలేదు.

ఏడూర్లు పెట్టి కనకయ్య వూరు వెళ్ళాడు. మనవరాల్ని సముదాయిస్తూ 'జయా! మీ అమ్మవుంటే పెద్ద పండగ చేసేది. పెద్ద దాన్ని నేనేం చేయగలను. ఏ లోకంలో వున్నా సీతమ్మకి ఈ కబురు తెలుస్తుంది. తప్పక సంతోషిస్తుంది. నిన్ను దీవిస్తుంది. జడవేసుకో. మీ నాన్నొచ్చేది ఇవ్వాళేనమ్మా! ' అని గుర్తు చేసింది.

'నాయనమ్మా! పొలం వెళ్ళి అమ్మతో నేను ప్యాసైన సంగతి చెప్పొస్తా'.

'పిచ్చి తల్లీ! వెళ్ళిరా... జడేసి తల్లో పూలు పెడతా. అప్పుడు వెళ్దుగాని. చక్కగా వెళ్తే మీ అమ్మ ఎంతో సంతోషిస్తుంది'.

జయ కాదనలేదు. మౌనంగా జడ వేయించుకుంది.

జయ పొలానికి బయలుదేరింది. అడుగులు వడివడిగా పడుతున్నాయి. తీవ్రంగా ఆలోచన్లు ఆ లేత హృదయాన్ని చుట్టుముట్టి కలవరపరుస్తున్నాయి —

తల్లి అన్నా, తనన్నా పంచ ప్రాణాలు ఇచ్చే తండ్రి అన్నా మరిచిపోయినట్టు ఏడూర్లు కాగానే పెళ్ళి కొడుకుగా మారిపోయాడు. దేవతలాంటి తల్లి అప్పుడే తండ్రి మనసులో నుంచి మరుగైపోయిందా? రెండో పెళ్ళి చేసుకొస్తున్నాడు. భర్త పోతే పుట్టింట్లో వుంటున్న పిన్నమ్మ మాణిక్యాన్ని చేసుకుంటున్నాడు. ఎందుకిలా జరుగుతోంది? తనే సర్వస్వంగా ఎంచే తండ్రి ఎలా మారుమనువుకి సిద్ధ పడ్డాడు? తన చదువు సాగుతుందా? పిన్నమ్మయినా ఇప్పుడు సవతి తల్లే కదా! ఎన్ని బాధలు పెడుతుందో యేమో! పిల్లలు పుట్టిన తర్వాత తన కష్టాలకు అంతే వుండదు. తండ్రి కూడా మారిపోతాడు. పిన్నమ్మ చేతిలో కీలుబొమ్మవుతాడు. అప్పుడు తను ఇంకా యాతనల పాలవుతుంది —

జయ కళ్ళలో నీళ్ళు కమ్ముకున్నాయి. కాలిబాట సరిగా కనిపించటం లేదు. కళ్ళు తుడుచుకుంది.

ఎదురుగా తల్లి సమాధి. మామిడిచెట్టు కింద అందమైన పాలరాతి దిన్నె.

జయ దానిపైన వాలిపోయింది. వెక్కి వెక్కి యేడ్చింది.

సంబాళించుకుంది.

'అమ్మా! అమ్మా! నేను ఫస్టున ప్యాసయ్యానమ్మా. నువ్వు కిందటేడు సంబరంతో ఎంతో హడావుడి చేశావు. ఇప్పుడు నాయనమ్మ పెద్దది ఏంచేస్తుంది... అమ్మా! నేను ఇంకా బాగా చదువుకుంటానమ్మా. నీ కోరిక నెరవేరుస్తాను. ఎక్కడున్నా నువ్వు ఆనందిస్తావని నాకు తెలుసు. నా మాటలు నీకు వినపడతాయి. కాని నీ మాటలే నాకు వినిపించవు. కల్లో ఎప్పుడూ నువ్వే కనిపిస్తావమ్మా. కళ్ళు తెరిస్తే నువ్వుండవు నీ ఫోటో వుంటుంది. నవ్వుతూ నన్ను పలకరిస్తుంది... అమ్మా! నీకింకో సంగతి చెప్పాలని వచ్చా. నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకునేందుకు వెళ్ళాడు. నేను

భరించలేను. ఇది నీకు ద్రోహం కాదా! పిన్నమ్మను చేసుకుంటున్నాడు. ఎవరైనా సరే... నిన్ను మరిచిపోయినట్టేగా అమ్మా. పెళ్ళి చేసుకుని ఇవ్వాళే మనింటికి వస్తారటమ్మా. ఆ యింట్లో నేనెలా వుండను. మరి ఎక్కడుండాలి చెప్పమ్మా. అమ్మా! చెప్పు.'

జయ మూగరోదనకు బదులు రాదు.

దూరంగా ఎడ్లబండి గంటల చప్పుడు రావడంతో తలెత్తి చూసింది. అది తమ బండే. పొలంవైపే వస్తోంది.

జయ గబగబా వెళ్ళి దగ్గర్లో చింతచెట్టు చాటున నిల్చుంది — ఇక్కడ వారి కంట పడడం ఇష్టంలేక ఆశ్చర్యం!! బండిని బండ్ల బాటలో ఆపి సమాధి వైపు వస్తున్నారు. పెళ్ళి చేసుకుని వచ్చిన వాళ్ళు రామాలయానికో గ్రామ దేవత గుడికో ముందు వెళ్ళడం ఆచారం. సమాధి దగ్గరికి రావడం వింతగా అనిపించింది జయకి.

అక్కడ ఏం జరుగుతుందో కుతూహలంతో గమనిస్తోంది.


తండ్రీ, పిన్నమ్మా చేతులు జోడించి సమాధి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి నమస్కరించారు.

తండ్రి అమ్మ సమాధితో అంటున్నాడు .

'సీతా! నువ్వు దేవతవు. ఇదిగో నీ చెల్లెలు మాణిక్యం. చివరి శ్వాస విడిచేటప్పుడు నువ్వు రహస్యంగా నా చేత ప్రమాదం చేయించుకున్నావు గుర్తుందా! మన చిట్టి తల్లికి మరో అమ్మను తెచ్చాను. అమ్మను తేలేనుగా. నీ మాట కాదనలేక ఈ పని చేశాను. మళ్ళీ పెళ్ళికి ఉబలాట పడికాదు సీతా! ఇప్పుడు మన జయకి తల్లి కావాలి. ఆలనా పాలనా చూసే ఆడ మనిషి కావాలి. ఈ బాధ్యత నా కప్పగించి నువ్వు దేవతవై వెళ్ళిపోయావు' బిగ్గరగా ఏడ్చాడు.

జయకి ఏడ్పు వచ్చింది. కాని వింటారని దిగమింగుకుంది.

'ఊరుకో బావా! ఉన్నంతకాలం



మీకు సేవ చేసింది. పలుగురి చేత ఉత్తమురాలనిపించుకుంది. పసుపు కుంకుమ లతో సుమంగళిగా వెళ్ళిపోయింది సీతక్క' పిన్నమ్మ మాణిక్యం ఓదార్పుగా అంది.

తండ్రి ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకు న్నాడు.

'సీతా! నువ్వు చెప్పిన మరో మాట మాత్రం నేను పాటించలేదు. అది నాకు సమ్మతంకాదు కూడా. మాణిక్యాన్ని పెళ్ళి చేసుకుని ఇంటికి వెలుగుగా కొడుకుని కనమని చెప్పావు. ఈ విషయంలో నన్ను అర్థం చేసుకోలేక పోయావ్ సీతా! నేనూ అందరిలాంటి వాడినే అనుకున్నావ్ కదూ! నేను ఈ పెళ్ళికి ఒప్పుకుందీ, నీకు ప్రమాణం చేసి చెప్పిందీ జయ కోసమే. జయే మా సర్వస్వం. ఇంక సంతానంతో మాకేం పని. అందుకే మాణిక్యాన్ని పెళ్ళి చేసుకోవడానికి ముందే నేను ఆపరేషను చేయించుకున్నా. ఇది మాణిక్యం సమ్మతి తోనే జరిగింది. కొడుకే వెలుగనుకుంటు న్నావా? ఎందుకలా అనుకున్నావ్! మన జయే మన యింటికి వెలుగు. జయ కోసమే మా యిద్దరి జీవితాలు ధారపోస్తాం'.

ఇద్దరు అలా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. తండ్రి ఇంకేదో చెప్పసాగాడు.

'రేపే జయకి స్కూలు ఫలితాలు చెబుతారు. విరుదు మాదిరి సంబరం జరపాలని ఇవ్వాళే మాణిక్యాన్ని తీసుకువచ్చా. దేవతవైన నీ ఆశీస్సులు కావాలి'.

ఇద్దరూ తలలు వంచి సమాధికి నమస్క రించారు.

జయ మనసు కుదుట పడింది.

వాళ్ళ కంటపడకుండా జయ యింటికి పరుగుతీసింది. తండ్రిని అపార్థం చేసుకు న్నానని విచారించింది.

ఇల్లు చేరి తండ్రి, పిన్నమ్మ రాకకోసం నిరీక్షించింది.

రాగానే 'నాన్నా! అమ్మా!' లోపలికి రండి అని హారతిచ్చి ఆహ్వానించింది.

ఆ మాటవిని ఆశ్చర్యపోయి సంతోషం పట్టలేక ఇద్దరూ కలిసి జయని గుండెలకు హత్తుకున్నారు.

నాయనమ్మ ఆనంద బాష్పాలతో అందరి నీ దీవించింది.

** ** **

